క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యం



పట్నంబజారు: తల్లిదండ్రులు మందలించారని విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత గుంటూరులోని సోము వారి వీధిలో నివాసం ఉండే 12 ఏళ్ల నూకతోటి రెస్వంత్ సాగర్, 7వ తరగతి చదువుతున్నాడు. హోం వర్క్ సరిగా చేయలేదని తల్లిదండ్రులు మందలించిన నేపథ్యంలో ఈనెల 15వ తేదీ ఉదయం 3 గంటలకు స్కేటింగ్‌కు వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువుల నివాసాల్లో విచారించినప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. విద్యార్థి తల్లి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



లక్ష్మీపురం: యువతి అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. పీఎస్ నగర్‌కు చెందిన ధనుప్రియ, శారదా కాలనీకి చెందిన కుంచాల్ల వెంకటేశ్వర్లు ప్రేమించుకుని పెద్దల సమక్షంలో నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం శారదాకాలనీలో నివసం ఉంటున్నారు. బుధవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి సాయంత్రం అయిన తిరిగి ఇంటికి చేరుకోలేదు. చుట్టు పక్కల పరిశీలించగా ఆచూకి తెలియక పోవడంతో ధనుప్రియ మామయ్య అయిన భవాని శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకి తెలిసిన వారు అరండల్‌పేట సీఐ ఆరోగ్య రాజు 8688831332, ఎస్ఐ కృష్ణబాజి 8886892134 లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

కాచి చల్లార్చిన నీరు తాగాలి

నెహ్రూ నగర్: నగరం ప్రజలు రక్షిత తాగునీటిని కాచి చల్లార్చిన తరువాత తాగాలని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థకు తాగు నీరు అందించే ప్రకాశం బ్యారేజ్‌కు గోదావరి జలాలు పట్టిసీమ నుంచి వస్తున్నందున సదరు నీటిలో టర్బిటి శాతం(బురద) దృష్ట్యా జాగ్రత్త తీసుకోవాలని కోరారు. హెడ్ వాటర్ వర్క్స్ లో ముడి నీటిని మరింత శ్రద్ధగా ఫిల్టరేషన్ చేయడం, క్లోరిన్, ఆలం మిక్సింగ్ లను తగిన మోతాదులో కలిపేలా ఎస్ఈ, ఈఈలు దృష్టి సారించాలని ఆదేశించారు.

లాడ్జిలలో నిబంధనలు పాటించాలి



లక్ష్మీపురం: వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పట్టాభిపురం, అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న లాడ్జిలలో చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే సహించేది లేదని వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ అన్నారు. గుంటూరులోని వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని అరండల్‌పేటలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో లాడ్జి నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లాడ్జిలలో కచ్చితంగా సీసీ కెమెరాలు ఉండాలన్నారు. ప్రధానంగా పేకాట, బెట్టింగ్‌లతో పాటు అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తీవ్రతరంగా ఉంటాయని హెచ్చరించారు. మైనర్‌లకు రూమ్స్ ఇవ్వడం నేరం అన్నారు. మరి ముఖ్యంగా లాడ్జిలకు వచ్చే వ్యక్తుల నుంచి పూర్తి సమాచారం ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌లతో పాటు సమగ్రమైన సమాచారం చిరునామా తీసుకోవాల్సిందిగా సూచించారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, అరండల్‌పేట సీఐ ఆరోగ్య రాజు పాల్గొన్నారు.

మానవ అవయవ వ్యవస్థ పనితీరుపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో బుధవారం మా అడ్వాన్స్‌డ్ డయాగ్నోస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్–2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ఎం.ఆదినాయణ మానవ అవయవ వ్యవస్థ పనితీరు, గర్భస్థ శిశువు కదలికలు, సీటీ స్కాన్, ఎమ్మారై, అల్ట్రా సౌండ్ తదితర యంత్రాల పనితీరును 9, 10 తరగతుల విద్యార్థులకు వివరించారు. దేశాభివృద్ధిలో నూతన ఆవిష్కరణలను నెలకొల్పే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వైద్యారోగ్య రంగంలో సాంకేతికంగా చోటు చేసుకుంటున్న అభివృద్ధిని వివరించేందుకు ఫ్యూచర్ ఇండియా కార్యక్రమం చక్కగా ఉపయోగపడిందన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు కృషి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు హౌస్ సిస్టం దోహదపడుతుందని ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో 2025–23 విద్యాసంవత్సరానికి హౌస్ సిస్టంను బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఫ్రాన్సిస్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, ఆరోగ్య జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం పాల్గొన్నారు.



నగరంలో ట్యాంకర్ల వద్ద బారులు తీరి నీళ్లు పట్టుకుంటున్న మహిళలు



- నాలుగు రోజుల నుంచి సరఫరా బంద్
- ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నమంటున్న అధికారులు
- అడుగడుగునా తాగునీటికి అవస్థలు
- కాలకృత్యాలకు కూడా నీరు లేక ఇబ్బందులు పడుతున్న నగర వాసులు

చుక్కనీరు దొరికితే ఒట్టు

నెహ్రూనగర్: నగరవాసులు గొంతెండుతోంది.. ట్యాంకర్ కనిపిస్తే బారులు తీరుతున్నారు.. నీటివసతి లేని ఏడారి ప్రాంతంలో నీటి కొరత వేధిస్తోంది. ఎప్పుడు చూడనంతగా సరఫరా నిలిచిపోయింది. తాగునీటి సరఫరా చేసే పైపులైన్లు మరమ్మతులు గురవుతున్నాయి. ఇదంతా కార్పొరేషన్‌లో పరిధిలో పనిచేసే ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెకు దిగడం. అయినా పాలకులకు ఏమాత్రం పట్టడం లేదు.

సరిపడ ట్యాంకర్లు లేక అవస్థలు

నగరంలో తాగునీటి సమస్య రోజురోజుకి ఉత్పన్నమవుతున్న క్రమంలో నగర ఇన్‌చార్జి కమిషనర్ చల్లా ఓబులేసు 0863–2345103 నంబర్‌కు కాల్ చేస్తే ట్యాంకర్లు పంపుతామని ప్రకటించారు. అయితే ట్యాంకర్ల కోసం నగర వాసులు వందల సంఖ్యలో ఫోన్లు చేయడంతో వారికి పంపేందుకు సరిపడ ట్యాంకర్లు లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ప్రజాప్రతినిధులు చెప్పే వారికి మాత్రమే ట్యాంకర్లు పంపిణీ చేస్తున్నారంటూ కొంత మంది ఆరోపించారు. కాలకృత్యాలకు కూడా సరిపడ నీళ్లు లేకపోవడంతో మినరల్ వాటర్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

విధుల్లో చేరని కార్మికులు...

ఆదివారం నుంచి హెడ్ వాటర్ వర్క్స్‌లో పనిచేసే ఇంజినీరింగ్ విభాగం కార్మికులు సమ్మెలో ఉన్నారు. అయితే వీరికి షోకాజ్ నోటీసులు కమిషనర్ జారీ చేశారు. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కూడా విధుల్లో చేరాలని కోరారు. అయినా ఇది రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మె కారణంతో మేము సరైన నిర్ణయం తీసుకోలేమని యూనియన్ నాయకులు చెబుతున్నారు. సమ్మెను నీరుగార్చేందుకు అధికారులు మైండ్ గేమ్ ఆడుతున్నారని యూనియన్ నాయకులు ఆరోపిస్తున్నారు. కార్మికులు విధుల్లో చేరకపోయినప్పటికీ విధుల్లో చేరుతున్నారని కార్పొరేషన్ తప్పుడు ప్రకటనలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని యూనియన్ నాయకులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

నులకపేటలో గుంటూరు చానల్‌కు గండి...



గండిని పొక్లెయిన్‌తో పూడుస్తున్న దృశ్యం

కృష్ణా నది నుంచి గుంటూరు నగరానికి తాగునీటిని సరఫరా అయ్యే గుంటూరు చానల్‌కు నులకపేట వద్ద గండి పడింది. నులకపేటలో ఓ అపార్ట్‌మెంట్ వాసులు చానల్ వద్ద కల్వర్టు కట్టేందుకు గండిపెట్టారని సమాచారం. దీంతో గుంటూరుకు రావాల్సిన రా వాటర్(ముడి నీరు) పక్కన పొలాల్లోకి వెళ్లిపోయింది. దీంతో పంపింగ్ పూర్తి స్థాయిలో ఆగిపోయింది. బుధవారం ఉదయం ఇంజినీరింగ్ అధికారులు గండి పూడ్చారు. దీంతో సరఫరా పునరుద్ధరించారు. బుధవారం రాత్రికి వాటర్ ఫిల్టరేషన్ జరిగి రిజర్వాయర్లకు సరఫరా అవుతుందని.. గురువారం ఉదయం నాటికి పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా పునరుద్ధరణ జరుగుతుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

కార్పొరేషన్ కార్మికుల వంటా– వార్పుతో నిరసన

4వ రోజుకు చేరిన ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె



తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వద్ద వంటా వార్పుతో వినూత్న నిరసన

లక్ష్మీపురం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త సమ్మె బుధవారానికి 4వ రోజుకు చేరింది. వంటా– వార్పు కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు హెడ్ వాటర్ వర్క్స్, తక్కెళ్లపాడు వద్ద కార్మికుల దీక్షకు వివిధ ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ, వారికి ఇవ్వాల్సిన కనీస వేతనం ఇవ్వకుండా సమ్మెలోకి నెట్టి, ప్రజలను నీటి కష్టాలకు గురి చేసిందని విమర్శించారు. గుంటూరు నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి కష్టాలకు కారణం ప్రభుత్వమేనని ఆరోపించారు. కార్మికులు కోరుతున్నది గొంతెమ్మ కోరికలు కాదని, వారి శ్రమకు తగ్గ ఫలితం అడుగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం(ఏపీకేఎస్) జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(బెఫి) రాష్ట్ర నాయకులు ఎం.సాంబశివరావు, ఓబీసీ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాము, ఆంధ్రప్రదేశ్ మెడికల్– సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్(ఏపీఎంఎస్ఆర్‌యూ) రాష్ట్ర నాయకులు షేక్ అబ్దుల్ సలీం, ఫణీంద్ర, జన్నత్ హుస్సేన్, 108 అంబులెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బాబు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్స్ – మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆది నికల్సన్ మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు.

అధికారుల అసత్య ప్రకటనలు మానుకోవాలి

నగరంలో ప్రజలు నీటి కష్టాలను ఎదుర్కొంటూ, అధికారుల మీద నీటి కష్టాలు తొలగించాలని ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో అధికారులు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె విరమించి విధులకు హాజరైనట్లు తప్పుడు ప్రకటనలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు అన్నారు. కార్మికులు సమ్మెలో ఉండడంతో నగరంలో నీటికి ఇబ్బందులు పడుతున్నారని, కార్మికుల సమస్యలు పరిష్కారం చేసి సమ్మె విరమింప చేసేందుకు గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేయకపోగా, తప్పుడు ప్రకటనలతో కార్మికులను గందరగోళపరుస్తున్నారని ఆరోపించారు.

అధికారం కోసం ప్రజలను మోసం చేసిన చంద్రబాబు



స్కానర్లు ఆవిష్కరిస్తున్న పార్టీ నగర అధ్యక్షురాలు

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా

పట్నంబజారు: చంద్రబాబు కేవలం అధికారం కోసం ప్రజలను నమ్మించి వంచించారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా విమర్శించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో బుధవారం బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. 10, 14, 15 డివిజన్‌లకు సంబంధించి పార్టీ డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, స్థానిక నేతలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి స్కానర్లు చూపి బాబు ఇచ్చిన హామీలు, మోసం చేసిన విధానాలపై ప్రజలకు వివరించాలని కోరారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ భారీగా హామీలు ఇచ్చి, ప్రజలను నట్టేట ముంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతోందన్నారు. తల్లికి వందనాన్ని మంగళం పాడారని, ఉచిత బస్సు ఏమైందని, గ్యాస్‌కు గ్యాస్ కొట్టారని ఆరోపించారు. కచ్చితంగా రానున్న రోజుల్లో చంద్రబాబు, కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కోటా సత్యం, షేక్ నజీర్, అజయ్ పాల్గొన్నారు.

కిమ్స్ శిఖరలో ఆధునిక లివర్ చికిత్సలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

గుంటూరు మెడికల్: లివర్ దెబ్బతిని ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారికి లివర్ మార్పిడి ఆపరేషన్లు చేయకుండానే అత్యాధునిక చికిత్సతో ప్రాణాలు కాపాడవచ్చని గుంటూరు కిమ్స్ శిఖర గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు పేర్కొన్నారు. బుధవారం గుంటూరు మంగళదాస్‌నగర్‌లోని హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లాకు చెందిన 25 ఏళ్ల యువతి నాలుగు రోజులు క్రితం ఎలుకల మందు తిని ఆస్పత్రిలో చేరగా 72 గంటల తర్వాత లివర్ డ్యామేజ్ లక్షణాలు కనిపించాయన్నారు. లివర్ ఫెయిల్యూర్‌కు దారి తీసే పరిస్థితి యువతికి వచ్చినట్లు నిర్ధారించామన్నారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ తక్షణంగా చేయడం సాధ్యంకాకపోవడంతో, అత్యాధునిక చికిత్సా పద్ధతి 'సెంట్రిఫ్యూగల్ ప్లాస్మా ఎక్స్ చేంజ్' అనే ప్రత్యేకమైన బ్లడ్ ప్యూరిఫికేషన్ చికిత్సను చేసి రోగి ప్రాణాలు కాపాడామన్నారు. చికిత్స నాలుగు సెషన్లు చేసిన తరువాత లివర్ ఫంక్షన్ సాధారణ స్థితికి వచ్చిందన్నారు. ఏపీలో మొట్టమొదటిసారిగా గుంటూరులో తమ ఆసుపత్రిలో ఆధునిక లివర్ చికిత్సలను అందుబాటులోకి తీసుకొచ్చామని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో డాక్టర్‌ప్రతాప్ మౌళి, డాక్టర్ విశ్వప్రసాద్, డాక్టర్ వివేక్, డాక్టర్ యామిని, డాక్టర్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

రోటరీ సేవా కార్యక్రమాలను విస్తరింపజేయాలి



క్లబ్‌ల నూతన కార్యవర్గ సభ్యులు

నగరంపాలెం: సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరింపజేయాలని గుంటూరు జిల్లా రోటరీక్లబ్ గవర్నర్ డాక్టర్ ఎస్వీ రామ్‌ప్రసాద్ అన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ప్రేరణ సంస్థ(2025–26) నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలుగా మన్నె అనూరాధ, కార్యదర్శిగా నందిపాటి వాణీకుమారి, కోశాధికారిగా జవ్వాది జయశ్రీ, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ప్రేరణ అధ్యక్షురాలుగా పోలిశెట్టి రిషిత, కార్యదర్శిగా పాములపాటి అమృత, కోశాధికారిగా కనమర్లపూడి అనూరూప, కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ. రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ స్థాయిలో సామాజిక అవసరాలను గుర్తించాలని అన్నారు. రోటరీ క్లబ్ ద్వారా వారికి సహాయ సహకారాలు అందించేందుకు నూతన కార్యవర్గ సభ్యు లు సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రోటరీ గుంటూరు జిల్లా సహాయ గవర్నర్ కేవీ భాస్కర్ పాల్గొన్నారు.

గణిత సామర్థ్యాలపై దృష్టి పెట్టాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: విద్యార్థులలో గణిత సామర్థ్యాలను మెరుగుపరిచి వారిలో మేధో వికాసాన్ని పెంపొందించాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ నారు శ్రీనివాసరెడ్డి సూచించారు. బుధవారం అమరావతి రోడ్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన తొమ్మిదో రాష్ట్ర స్థాయి యూసీ ఎంఏఎస్(యూసీ మాస్) పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెయిన్ టెక్నాలజీ బిజినెస్ హెడ్ ఎం.శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రసంగాన్ని కొనసాగిస్తూ విద్యార్థులకు గణితంలో ఉత్తమ తర్ఫీదు ఇవ్వాలని చెప్పారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ గణితంతో వేగం, కచ్చితత్వాన్ని పెంపొందించవచ్చు అన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ సాహితీ మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. వైవా స్కూల్ ప్రిన్సిపాల్ సరళ దేవి మాట్లాడుతూ అంక గణితానికి మానవ జీవితంలో ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. అనంతరం మూడు విభాగాలలో జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెయిన్ సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, రమ, అమర్నాథ్, నితిన్, పూజ, నందిని, మహాలక్ష్మి, లీల, మణి, జ్యోత్స్న, జ్యోతి, జీవన పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు స్మారక ట్రస్ట్‌కు స్థలం కేటాయింపు అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, ఆర్యవైశ్య నాయకులు

నగరంపాలెం: అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక ట్రస్ట్‌కు అమరావతిలో స్థలం కేటాయించడం అభినందనీయమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. బుధవారం నాజ్‌సెంటర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు హామీ మేరకు శాఖమూరు పార్క్‌లో 6.8 ఎకరాలు కేటాయించారని అన్నారు. ఈ మేరకు స్థలం కేటాయిస్తూ సీఆర్‌డీఏ ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. ఆర్యవైశ్య నాయకులు కొనకళ్ల సత్యం మాట్లాడుతూ శాఖమూరిలో 6.8 ఎకరాల్లో పొట్టి శ్రీరాములు స్మృతివనం, 58 అడుగుల విగ్రహం ఏర్పాటుకు సీఆర్‌డీఏ అనుమతులు జారీ చేయడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అర్వపల్లి శ్రీను, గజ్వేల్ అంకారావు, అన్నవరపు చక్రి, ఆర్యవైశ్య సంఘం నాయకులు గుడివాడ రవి, కోటా శేషగిరి, బొలిశెట్టి పాపారావు, రాయవరపు అశోక్, జుజ్జూరి శేష ప్రభాకర్‌రావు, అచ్యుత నిరంజన్ పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐలో చేరిన విద్యార్థులు

లక్ష్మీపురం: దేశంలోనే యువతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చే పార్టీ ఉందంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం అన్నారు. గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం తూర్పు నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యేలు షేక్ మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావుల నేతృత్వంలో పలు కళాశాలల విద్యార్థులులు ఎన్ఎస్‌యూఐ విద్యార్థి విభాగంలో చేరారు. ముందుగా విద్యార్థులను ఎన్ఎస్‌యుఐ కండువాతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మదన్, తిరుమల రావు, గౌతమ్ పాల్గొన్నారు.

పెండింగ్ చలానాలు వెంటనే చెల్లించాలి



పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం పెండింగ్ చలానాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్‌కుమార్ పర్యవేక్షణలో ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్ తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 40 ఆటోలు గుర్తించి, వీరి వద్ద నుంచి రూ.40 వేలు అపరాధ రుసుం, పాత బకాయిలు వసూలు చేశారు. సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో నిత్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. పెండింగ్ చలానాలను ఉంటే తక్షణమే వాహనదారులు చెల్లించాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎస్ఐ రవీంద్రబాబు, ఆర్ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

ఇన్వర్టర్ వితరణ

గుంటూరు ఎడ్యుకేషన్: సంఘ మిత్ర మొహమ్మద్ సిరాజుద్దీన్ సహకారంతో వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్, శ్రీకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం ఏటుకూరులోని అభినందన పిల్లల ఆశ్రమంలోని బాలల అవసరమైన విద్యుత్ ఇన్వర్టర్ అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు ఎండీ సిరాజుద్దీన్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మాట ప్రకారం 15 రోజుల్లో విద్యుత్ ఇన్వర్టర్ అందజేశామని, పిల్లలకు భోజన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాశం సర్దార్ అభినంద్ యాదవ్, కోనంకి మురళీకృష్ణయాదవ్, బొడ్డుపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం



రైల్వే స్టేషన్‌లో మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ ఎస్ఐ శ్రీనివాసరావు, జీఆర్పీ ఎస్ఐ అనిత మాట్లాడుతూ ప్రధానంగా రైల్వే ప్రయాణికులు మానవ అక్రమ రవాణా జరిగిన ట్లు అనుమానం కలిగిన తక్షణమే ఉచిత హెల్ప్‌లైన్ నంబర్లు, 1098 లేదా1800 1027 222 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. క్రాఫ్ట్ జిల్లా కోఆర్డినేటర్ కోలా సమీర్ కుమార్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా వల్ల జరిగే ప్రమాదాలు పిల్లల్ని మానవ అక్రమ రవాణా కు ఏ విధంగా గురి అవుతారు అనే విషయాలను ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

స్మార్ట్ మీటర్ల అమలు నిలిపివేయాలి

ప్రజాసంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ వేదికపై సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల

లక్ష్మీపురం: స్మార్ట్ మీటర్ల అమలును తక్షణం నిలిపివేయాలని, ఇప్పటికే బిగించిన మీటర్లను తొలగించాలని, ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, విద్యుత్ ఛార్జీల పెంపును వెనక్కి తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అదనంగా వసూలు చేసిన రూ.2,787 కోట్లు వినియోగదారులకు తిరిగి చెల్లించాలని, 2019–25 మధ్య వసూలైన రూ.1,500 కోట్లు బిల్లుల్లో మినహాయించాలన్న డిమాండ్లను ప్రతిపాదించారు. అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని, ప్రజావ్యతిరేక విద్యుత్ చట్ట సవరణలను వెనక్కి తీసుకోవాలని స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఒక్క మీటర్‌కి రూ.9,000 నుంచి రూ.18,000 వరకు ఖర్చును వినియోగదారుల నుంచే వసూలు చేయడం, రిమోట్ కంట్రోల్ ద్వారా విద్యుత్ నియంత్రణ, ముందస్తు రీచార్జ్ విధానం ద్వారా ప్రజలపై అదనపు భారం పడే ప్రమాదం ఉందని విమర్శించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వ్యతిరేకంగా ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు మండల, పట్టణ స్థాయి సదస్సులు, ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు ఇంటింటి ప్రచారం, సంతకాల సేకరణ, ఈనెల 30వ తేదీ నుంచి ఆగస్టు 4న కాలనీ సమావేశాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 5 న రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు, ఆగస్టు 7 న గుంటూరు జిల్లాలో ప్రత్యేక నిరసనలు తెలియజేనున్నట్లు తెలిపారు. సమావేశానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ సంయుక్త అధ్యక్షత వహించారు. సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకుడు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్)ప్రజాపోరు నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్. అరుణ, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ చిష్టీ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే అజయ్ కుమార్, సీఐటీయూ నగర కార్యదర్శి కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌తో టైఫాయిడ్‌ను నియంత్రించవచ్చు

గుంటూరు ఎడ్యుకేషన్: భారత్ బయోటెక్ అభివృద్ధి పరచిన వ్యాక్సిన్‌తో టైఫాయిడ్‌ను నియంత్రిచవచ్చునని సంస్థ ఏరియా సేల్స్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. బుధవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఫార్మాస్యూటికల్ రెగ్యులేటరీ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో టైఫాయిడ్ వ్యాక్సిన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ భారత్ బయోటెక్ నూతనంగా ప్రవేశపెట్టిన టైఫాయిడ్ వ్యాక్సిన్ గురించి వివరించారు. టైఫాయిడ్ జ్వరం లక్షణాలు, అవసరమైన పరీక్షలు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్స విధానాలను వివరించారు. భారత్ బయోటెక్ సంస్థ డాక్టర్ కృష్ణ యల్లా పర్యవేక్షణలో అభివృద్ధి పరచిన వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా టైఫాయిడ్‌ను నివారించవచ్చునని, డోసు, భద్రపర్చే విధానాలతో పాటు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ ఎ.ప్రత్యూష, ఫార్మాడి డైరెక్టర్ పి.సీతారామయ్య, బయోటెక్నాలజీ విభాగాధిపతి జె.శివజ్యోతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి. జవహర్‌బాబు, పాల్గొన్నారు.